క్లుప్తంగా

ఉప ముఖ్యమంత్రి పరామర్శ



కేశవ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకుడు మద్దెల గోవింద తండ్రి కేశవ శనివారం మృతి చెందగా విషయం తెలుసుకున్న ఉప ముఖ్య మంత్రి పీడిక రాజన్నదొర ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

జిల్లా కేంద్రంలో నో యాక్సిడెంట్ డే



వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ

పార్వతీపురం టౌన్‌: ప్రతీ ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నో యాక్సిడెంట్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహన చోదకులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై రోడ్డు భద్రతా, రక్షణ, అతి వేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. రహదారిపై ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ధ్రువపత్రాలు వెంట ఉంచాలన్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలు నడవరాదని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది కిషోర్, సంవత్, ఆటో డ్రైవర్‌లు, వాహనచోదకులు తదితరులు పాల్గొన్నారు.

12న దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం

తెర్లాం: బొబ్బిలి పట్టణంలో ఈ నెల 12వ తేదీన దివ్యాంగుల ఉపకరణాల గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై శనివారం విలేకరులతో మాట్లాడిన ఆయన మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ఉన్న దివ్యాంగులంతా ఈ శిబిరానికి విచ్చేసి, తనిఖీలు చేయించుకోవాలన్నారు. విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆలిమ్‌-కో-సంస్థ సహకారంతో జరిగే ఈ శిబిరంలో అవసరమైన వారికి ఉపకరణాలు అందజేయడం జరుగుతుందని, సంబంధిత ధ్రువపత్రాలతో శిబిరానికి హాజరు కావాలని కోరారు.

ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు



చినపాలవలసలో చెరువు గర్భంలో వేస్తున్న రోడ్డును పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

తెర్లాం: ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని చినపాలవలస గ్రామ చెరువు గర్భంలో నుంచి నడిచేందుకు వీలుగా రోడ్డు నిర్మిస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఆయన శనివారం అక్కడికి వెళ్లి, ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డు నిర్మాణానికి పాల్పడుతున్న రైతులను పిలిపించి, మాట్లాడారు. ప్రభుత్వ ఆస్తుల్లో రోడ్లు, కాలిబాటలు వేయడం చట్టరీత్యా నేరమని, వెంటనే ఇవి మానుకోవాలని లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమ నిర్మాణాన్ని తక్షణమే తొలగించాలన్నారు. ఆయన వెంట వీఆర్‌ఓలు స్వప్న, నరసింహనాయుడు ఉన్నారు.

16న ఆనందో బ్రహ్మ

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఈ నెల 16వ తేదీన ఆనందో బ్రహ్మ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు మింది విజయమోహనరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

క్రమశిక్షణతో మెలిగితే ఉజ్వల భవిష్యత్

వంగర: విద్యార్థినులు క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జీసీడీఓ మాలతి అన్నారు. శనివారం వంగర కేజీబీవీ విద్యాలయాన్ని తనిఖీ చేసిన ఆమె కాసేపు విద్యార్థినులతో మాట్లాడారు. విద్యాప్రమాణాలు తెలుసుకుని వాటిని మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు చేశారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయినుల పనితీరు, విద్యార్థులకు వండి పెడుతున్న భోజనాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అలాగే ఎం.సీతారాంపురం, వంగరలో పదోతరగతి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

జగనన్నకు అండగా ఉందాం...

- 'జగనన్నే మా భవిష్యత్తు'లో ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట:

ప్రజలంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. అరసాడలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి అంతా అండగా నిలవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుంటే ఈ పథకాలే కాకుండా మరిన్ని సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పెద్ద కొడుకు జగనన్న

మండలంలో పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. వంతరాంలో మండల ఉపాధ్యక్షురాలు బి.హేమలత ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నారాయణపురంలో ఎంపీటీసీ రామకృష్ణనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు రాధ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హేమలత మాట్లాడుతూ ఇంటి పెద్ద కొడుకులా జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

వార్డుల్లో...

పార్వతీపురం టౌన్‌: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని 30 వార్డుల్లో శనివారం నిర్వహించారు.



సీతానగరం: బూర్జలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



పార్వతీపురం టౌన్‌: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి బుక్‌లెట్‌లను అందిస్తున్న గృహసారథులు, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్



బలిజిపేట: వంతరాంలో ఇంటింటా తిరుగుతున్న మండల ఉపాధ్యక్షురాలు హేమలత

వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, నాయకులు ఇంటింటికి వెళ్లి జగనన్నకు మద్దతు తెలిపేలా కార్యాచరణ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజల మద్దతును కోరారు. ప్రజల అంగీకారంతో మొబైల్, ఇంటికి స్టిక్కర్లను అంటించారు. పట్టణంలో, వార్డుల్లో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. జగనన్న చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి బాగున్నాయని జగనన్నే మా భవిష్యత్తు అంటూ లబ్ధిదారులు పేర్కొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ నినదించారు.

సీతానగరంలో...

సీతానగరం: మండలంలోని బూర్జ, లక్ష్మీపురం గ్రామాల్లో సచివాలయ కన్వీనర్ల ఆధ్వర్యంలో శనివారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలవాలని కోరారు. జగనన్న స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వి.నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సర్పంచులు జి.దాసు, టి.సత్యవతి, ఎంపీటీసీలు ఇ.చిన్నంనాయుడు, టి.పార్వతి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పీఏసీఎస్ చైర్మన్ టి.సూరపునాయుడు, మండల పార్టీ నాయకులు ఆర్వీ, టీవీ అప్పలనాయుడు, ముకుంద, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంటిపేటలో..

అంటిపేటలో జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు పాల్గొన్నారు. పెదంకలాంలో ఎంపీపీ బి.రవణమ్మతో పాటు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొదమకు రేషన్ సరుకులు తరలించండి

- ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర ఆదేశం



సాలూరు:

గిరిశిఖర కొదమ పంచాయతీ గిరిజనులకు రేషన్ సరుకులు తరలించాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. దీనికి సంబంధించి పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడారు. కొదమకు రేషన్ సరుకులు తరలింపులో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పని చేయని అధికారుల వల్ల ప్రయోజనం లేదని, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందంటూ మండిపడ్డారు. ఇప్పుడున్న కాంట్రాక్టర్ రేషన్ సరుకులు కొదమకు సరఫరా చేయలేకపోతే కాంట్రాక్టర్‌ను మార్చాలని ఆదేశించారు. సరుకుల పంపిణీలో జాప్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు. సమస్య పునరావృతమైతే సహించేది లేదన్నారు. సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని సూచించారు.

పంటల వివరాలు తెలియజేయాలి

గరుగుబిల్లి:

రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలు తెలియజేయాలని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి కోరారు. రబీ సీజన్‌లో నువ్వులు, పెసర, మినుము, మొక్కజొన్న సాగు ఎక్కువగా ఉందని, ఆయా పంటలు పండిస్తున్న వారంతా ఆధార్ కార్డు, 1-బి నకళ్లను ఆర్‌బీకే సిబ్బందికి ఇవ్వాలన్నారు. ఇలా చేయడం ద్వారా ఎక్కడ ఏ పంట ఎంతమేర సాగు అవుతుందో తెలియడంతో పాటు ప్రభుత్వం పంటలు కొనుగోలు చేయడం, రైతులు తమ పంటలను అమ్మడం తేలికవుతుందన్నారు. దీన్ని గుర్తించి రైతులంతా పంటల వివరాలను తెలియజేయాలని సూచించారు. దీని వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అన్ని విధాల పాటుపడుతుందన్నారు. రైతుల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను, వ్యవసాయ పరికరాల సబ్సిడీ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10 నుంచి ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు

గరుగుబిల్లి: మండలంలోని సంతోషపురం గ్రామంతో పాటు మధుర గ్రామాలైన ఖడ్గవలస, పిట్టలమెట్ట గ్రామాల్లో ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ నెల 12వ తేదీ వరకు జరిగే కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. చివరి రోజు అమ్మవారి అనుపోత్సవం చేపడతామన్నారు.

శత్రుచర్ల పరామర్శ



రామారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

పార్వతీపురం: గరుగుబిల్లి మండల పరిషత్ అధ్యక్షుడు ఉరిటి రామారావు, కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పార్వతీపురంలో శనివారం పరామర్శించారు. ఇటీవల రామారావు తల్లి అమ్మడమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని పరామర్శించి, సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా మృతికి కారణాలు తెలుసుకున్నారు. వారి వెంట పలువురు నాయకులు, కార్యకర్తలున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

సీతానగరం: మండలంలోని ప్రముఖ రాజకీయ నాయకుడు సాలా హరిగోపాలరావు కుటుంబాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావుతో పాటు పలువురు ప్రముఖులు శనివారం పరామర్శించారు. హరిగోపాలరావు తల్లి నారాయణమ్మ(94) శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వీరు శనివారం హరిగోపాలరావు కుటుంబాన్ని పరామర్శించి సంతాపాన్ని వెలిబుచ్చారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, మాజీ ఎంపీపీ బి.చిట్టిరాజు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రముఖ వైద్యులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్‌లు ఉన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు

- గిరిజన సంఘాల నేతల డిమాండ్

జియ్యమ్మవలస: బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దని గిరిజన సంఘం నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై కురుపాంలోని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణిని ఆమె నివాసంలో శనివారం కలిసి, వినతిపత్రం అందజేశారు. ఆయా వర్గాలను ఎస్టీల్లో చేర్చడం ద్వారా ఎస్టీలకు జరిగే అన్యాయం వివరించారు. ఇప్పటికే విద్య, ఉద్యోగ రంగాల్లో బాగా వెనకబడిన ఎస్టీలు ఇప్పుడిప్పుడే ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ వారికి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయం అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోయక జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..

వీరఘట్టం: గిరిజనుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. బోయ, వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దని కోరుతూ గిరిజన సంఘం నాయకులు మండలంలోని వండవ గ్రామంలో ఉన్న ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించే ప్రయత్నం చేయగా, ఆందోళనకారులను వండవ జంక్షన్ వద్దే పోలీసులు అడ్డుకున్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని పోలీసులు సర్దిచెప్పడంతో ఆందోళనకారులు వెనుదిరిగినట్లు సమాచారం. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని పాలకొండ డీఎస్పీ జి.వి.కృష్ణారావు, సీఐ మురళీధర్ తెలిపారు. అనంతరం గిరిజన సంఘం నాయకులు చేస్తున్న ఆందోళనను పోలీసులు ఎమ్మెల్యేకు వివరించగా, ఆమె సానుకూలంగా స్పందించారు. గిరిజన సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. షెడ్యూల్ ఏరియాలోని గిరిజనులకు విద్య, ఉద్యోగావకాశాలు అలాగే కొనసాగుతాయని భరోసా ఇచ్చారు. ఇదే మాట సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారని గుర్తు చేశారు. ఇది గమనించి, గిరిజన సంఘం నాయకులు సమన్వయం పాటించాలని కోరారు. గిరిజనుల అభివృద్ధికి జగనన్న సర్కారు చేస్తున్న మంచిని గమనించాలన్నారు.



జియ్యమ్మవలస: కురుపాంలో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు



వీరఘట్టం: వండవ జంక్షన్‌లో గిరిజన సంఘం నేతలకు సర్దిచెబుతున్న డీఎస్పీ కృష్ణారావు, సీఐ మురళీధర్

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి

సీతానగరం: మండలంలోని రోడ్డు ప్రమాదాలు నివారణకు వాహన చోదకులు సహకరించాలని ఎస్‌ఐ కె.నీలకంఠం అన్నారు. రోడ్డు ప్రమాదాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాష్ట్ర రహదారిలో ఆర్వోబీ వద్ద వాహన చోదకులు, విద్యార్థులతో అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వాహనాలను నడపడం, మొబైల్‌లో మాట్లాడటం, అనుభవం లేని, చిన్న పిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి శనివారం నో యాక్సిడెంట్ డేగా గుర్తించి వాహనాలు తనిఖీ చేయడం జరుగుతోందన్నారు. రాష్ట్ర రహదారిలో ప్రమాదాలు నివారణకు, ప్రమాదాలకు కారణమైన వాహనాల్ని గుర్తించడానికి ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పత్యేక నిఘా పెట్టామని తెలిపారు. ప్రమాదాల నివారణకు వాహన చోదకులు సహకరించాలని కోరారు.



వాహనచోదకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ నీలకంఠం

ముస్లింలకు అండగా ప్రభుత్వం

పార్వతీపురం టౌన్‌: ముస్లిం సోదరులకు అండగా ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పవిత్రమైన రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం పార్వతీపురం మత పెద్దలు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అలజంగి జోగారావుని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రంజాన్ పర్వదినం సందర్భంగా తోఫా ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే ఈ సంవత్సరం కూడా రంజాన్ తోఫా ఇస్తానని ఎమ్మెల్యే తెలిపారు. షాదీ ఖానా కూడా ఏర్పాటుకు పూర్తి చర్యలు చేపట్టామని తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో షేక్‌సఫీ, మహ్మద్ జలాల్, ఫారుక్‌ఖాన్, ఇబ్రహీంమ్, ఖరీమ్, భాబ్‌జానీ, బుజ్జి అభీబ్, మఖ్బూల్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే జోగారావును కలిసిన ముస్లిం సోదరులు

రన్ ఫర్ జీసస్

పార్వతీపురం టౌన్‌: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకొని పార్వతీపురం మన్యం జిల్లా ఫాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసస్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫాస్టర్స్ ఫెలోషిప్ సంఘ సభ్యులు తిమోతి, సాల్మన్, సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రజలను పునీతులను చేసేందుకు శిలువ వేయబడ్డ ఏసు మరలా పునరుత్థానుడై వచ్చాడని తెలుసుకోవాలన్నారు. మన రక్షణ కోసం ఈ లోకానికి వచ్చిన యేసు మార్గాన్ని మనమంతా అనుసరించాలన్నారు. యేసు పునరుత్థాన వేడుకలను ప్రతి ఒక్కరం సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్స్ ఫెలోషిప్ సంఘ సభ్యులు సుధీర్ చంద్ర, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న ఫాస్టర్ల సంఘ సభ్యులు

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



పదమాయవలసలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. మండలంలోని పదమాయవలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామాలలో ఉండే ప్రతి కుటుంబంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యమన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడం, అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకం అందిందా.. లేదా.. అనేది గడప గడపనా తిరిగి అడిగి తెలుసుకుని వాటి పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అమ్మ ఒడి, రైతు భరోసా, ఇళ్లు, జగనన్న తోడు, పావలా వడ్డీ వంటి పథకాలు అర్హులకు అందుతున్నాయన్నారు. ప్రతీ గడపన తిరిగి మీకు సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఒక ఇంట్లో వివిధ పథకాలకు అర్హులు ఎంతమంది ఉంటే అంత మందికి ఎటువంటి సిఫార్సులు లేకుండా, ఎవరి చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా నేరుగా వలంటీర్ల ద్వారా అందిస్తున్న ప్రభుత్వం ఇదేనని తెలిపారు. పార్టీలకు అతీతంగా పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పారదర్శకంగా పని చేస్తుందన్నారు. సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.సత్యనారాయణ, ఎంపీడీఓ భానుమూర్తి, ఎంపీపీ జి.నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల పార్టీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల కన్వీనర్ల సంఘం అధ్యక్షుడు శ్రీరాములునాయుడు, ఎం.దుర్గేశ్వరి, ఉపసర్పంచ్ అప్పలనాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, సర్పంచ్‌లు కె.మోహనరావు, విజయ, బి.సత్యనారాయణమూర్తి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రధానంగా రద్దీగా ఉండే పార్వతీపురం - సాలూరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ ఒడిశాకు సాగే బీటీ రోడ్డు విస్తరణ పనులతో పాటు కాలువల పనులు సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు సూచించారు. చినబోగిలి మీదుగా మక్కువ దుగ్గేరు మీదుగా ఒడిశాకు వెళ్లే రహదారి విస్తరణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు చినబోగిలి నుండి మక్కువ వరకూ మొదటి విడతగా జగనన్న ప్రభుత్వం రూ.32 కోట్లు మంజూరు చేయగా సంబంధిత కాంట్రాక్టర్ నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. పనులను పరిశీలించిన ఎమ్మెల్యే జోగారావు సంతృప్తి వ్యక్తం చేస్తూ అనుకున్న సమయంలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు, సీనియర్ నాయకులు ఆర్వీ పార్థసారథి, జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటప్పలనాయుడు పాల్గొన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో బహుళ ప్రయోజనాలు

సీతానగరం: ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో గ్రామాల్లో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు వైద్య సేవలు అందించడంతో ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ)అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని మరిపివలస, నిడగల్లు, నీలకంఠాపురం, పాపమ్మవలస, వెంకటాపురం గ్రామాల్లో శనివారం నిర్వహించిన సార్వత్రిక టీకాల కార్యక్రమాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిడగల్లులో మాట్లాడుతూ చిన్నారులకు సార్వత్రిక టీకాలను నిర్దేశించిన సమయానికే గ్రామాల్లో సిబ్బంది వేస్తున్నారని,, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న రోగులకు క్షేత్ర స్థాయిలో వైద్యసేవలు అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాల వల్ల ఉపయోగాలు పిల్లల తల్లులకు వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.